# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం విధానాన్ని అమలు చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

**2. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల కమిటీ నివేదికను శాసనసభలో ప్రవేశపెడతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

**3. ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల సమస్యకు పరిష్కారంగా చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైందని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ ప్రకటించారు.**

**4. పులుల పర్యవేక్షణకు హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో 'టైగర్ సెల్' ఏర్పాటుచేయాలని రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయించింది.**

**5. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండేళ్లలో లక్ష కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణం జరగనుందని మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో సెప్టెంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం విధానాన్ని అమలు చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆబ్కారీ శాఖపై ముఖ్యమంత్రి గత సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త మద్యం విధానానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. కొత్త విధానంలో లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలకు అనుమతులు ఇస్తామని చెప్పారు. అలాగే గీత సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలు వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల కమిటీ నివేదికను శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెడతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న మంత్రివర్గం సమావేశమైంది అనంతరం రేవంత్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడారు. ప్రాజెక్టుపై కమిషన్ సమగ్ర నివేదికను జులై 31న ప్రభుత్వానికి అందజేసిందని తెలిపారు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి నివేదికపై సభ్యుల అభిప్రాయాలు సేకరిస్తామని, తర్వాత భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పంట నష్టం చేస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారంగా తొలిసారిగా చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ, చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం మొగిలి ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల గుంపును.. శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు విజయవంతంగా అడవిలోకి తరిమికొట్టాయని వెల్లడించారు. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వి. అనిత వెల్లడించారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో జైళ్లశాఖపై హోం మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కారాగారాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 122 జైళ్లకు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మధ్యలో నిలిచిపోయిన జైళ్ల భవనాల నిర్మాణాల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండేళ్లలో లక్ష కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరి తో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కు అదనంగా మరో లక్ష కోట్ల రూపాయల జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారని అన్నారు. రాష్ట్రంలో 70 వేల కోట్ల రూపాయలతో రహదారుల పనులు జరుగుచున్నాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ప్రభుత్వ విద్య విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మంత్రితో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతోపాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల ప్రతి సమస్యలను చర్చల ద్వారా పరిష్కారిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

అటవీ ప్రాంతంలో పెద్దపులులు, చిరుతల కదలికల పర్యవేక్షణకు హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో 'టైగర్ సెల్' ఏర్పాటుచేయాలని రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయించింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన తెలంగాణ వన్యప్రాణి సంరక్షణ బోర్డు 9వ సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. అడవుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, అటవీ

చట్టాల ఉల్లంఘనల్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అటవీ చెక్‌పోస్టుల ఆదాయం అటవీ సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. ఆదివాసీల హక్కుల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నైరుతి దిశగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...30 సెకన్లు

మరోవైపు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

సముద్రంలో కలిసే నీటిని మాత్రమే బనకచర్ల ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటుదని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నుంచి ప్రతి ఏటా సగటున 3 వేల టీఎంసీల వరద నీరు సముద్రంలో కలుస్తోందన్నారు. 2025 ఆరంభం నుంచి ఇప్పటి వరకూ 813 టీఎంసీల నీరు వృథాగా పోయిందని వెల్లడించారు. సముద్రంలోకి వృథాగా కలిసే జలాలను రాయలసీమకు తరలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు ప్రణాళిక రూపొందించిందన్నారు. నీటి వనరుల వినియోగం ద్వారా రెండు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

======================